క్లుప్తంగా

సజ్జలను కలిసిన ఎమ్మెల్సీ మేరిగ



సజ్జలను కలిసిన ఎమ్మెల్సీ మేరిగ, వైఎస్సార్ సీపీ నాయకులు

చిల్లకూరు: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త మేరిగ మురళీధర్ సోమవారం తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో సజ్జల రామక్రిష్ణారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. గూడూరు నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి, కూటమి నేతల అరాచకాలను వివరించారు. గూడూరు నియోజకవర్గానికి చెందిన మేధావుల ఫోరం అధ్యక్షుడు నందవరం సుబ్బారావును సజ్జలకు పరిచయం చేశారు. ఆయన వెంట నాయకులు ఎల్లంటి సనత్‌కుమార్‌రెడ్డి, కట్టా రాజేష్ తదితరులు ఉన్నారు.

మేధావుల ఫోరం సదస్సులో సుబ్రమణ్యం



జాతీయ నాయకుల చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న సజ్జల, తదితరులు

చిల్లకూరు: తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆ పార్టీ మేధావుల ఫోరం సదస్సు నిర్వహించారు. ఇందులో చిట్టమూరు మండలానికి చెందిన మేధావుల విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎస్‌వీ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ కార్యక్రమాలను భవిష్యత్తులో ఎలా అమలు చేయాలనే విషయాలపై పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామక్రిష్ణారెడ్డి, పార్టీ అనుబంధ విభాగాల ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మేధావుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వై.ఈశ్వరప్రసాద్‌రెడ్డితో కలిసి చర్చించారు. అంతకు ముందు జాతీయ నాయకుల చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గ్రీవెన్స్‌లో భూ సమస్యల వెల్లువ



అర్జీని పరిశీలిస్తున్న తహసీల్దార్ శైలకుమారి

దొరవారిసత్రం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శైలకుమారి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భూ సమస్యలపై ఫిర్యాదులు వెల్లువెత్తాయి. పట్టాదారు పాస్ పుస్తకాలు, 1బీ, అడంగల్‌లో చేర్పులు, మార్పులు, పింఛన్లు, పక్కా గృహాలు తదితరాలపై అర్జీలు వచ్చినట్టు తహసీల్దార్ తెలిపారు. వాటిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో గోవర్ధన, ఏఈ మోహన్‌రావు, ఏఈలు మెహతాజ్, ఉమామహేశ్వరి, సూపర్ వైజర్ హేమలత పాల్గొన్నారు.

పాఠశాలలో పిల్లల చేరిక



పిల్లలను పాఠశాలలో చేర్పిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

చిల్లకూరు: అంగన్‌వాడీ కేంద్రంలో ఐదేళ్లు పూర్తయిన పిల్లలను సమీపంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చేర్పించేందుకు ఐసీడీఎస్ అధికారులు చొరవ చూపుతున్నారు. ఈ క్రమంలోనే సోమవారం ఓడూరు గిరిజన కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఐదేళ్లు నిండిన నలుగురు పిల్లలను ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగిశెట్టి రేణుక మాట్లాడుతూ గిరిజన కాలనీలోని పిల్లలను స్థానికంగా ఉన్న ప్రాథమిక పాఠశాలలో చేర్పించి వేసవి సెలవుల్లో కూడా మధ్యాహ్నం భోజనం పెట్టేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. హెచ్ఎం సుధామ పిల్లలకు అడ్మిషన్ ఇచ్చారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త పేరమ్మ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాలు ప్రారంభం

గూడూరు రూరల్: ఆర్టీవో మురళీమోహన్ తన తల్లి కొర్రపాటి రాములమ్మ పేరు మీద చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని బీజేపీ నాయకుడు పాపారెడ్డి పురుషోత్తమరెడ్డి తెలిపారు. ఆయన సోమవారం గూడూరు పట్టణంలోని మినీ బైపాస్ వద్ద ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బాలక్రిష్ణనాయుడు, శివ తదితరులు పాల్గొన్నారు.

సైదాపురంలో..

సైదాపురం : స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం తహసీల్దార్ రమాదేవి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ కార్యాలయానికి వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటుచేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్, ఆర్ఐ తదితరులు పాల్గొన్నారు.

సరదా ఈత.. కడుపు కోత



సిలికా గుంతల్లో ఈత కొడుతున్న యువకులు

- వేసవిలో పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలి
- సంరక్షణలోనే ఈత నేర్చుకోవాలి
- సరదా కోసమని వెళితే ప్రాణాలు హరి

ప్రస్తుతం ఎండలు ఎక్కువగా కాస్తున్నాయి. ఉదయం పది గంటలకే సూర్యుడు భగభగమండుతున్నాడు. దీనికితోడు ఉక్కపోత తీవ్రంగా ఉండడంతో ప్రజలు భరించలేకపోతున్నారు. పిల్లలు వేడిని భరించలేక నీళ్లలో ఈత కొట్టడానికి వెళుతుంటారు. లోతు, నేల స్వభావం తెలియక నీటిలోకి దిగి ప్రాణాల మీదకు తెచ్చుకుని తల్లిదండ్రులకు గుండెకోత మిగిలిస్తున్నారు. ఈ క్రమంలో తల్లిదండ్రులు పిల్లలపై నిఘా పెట్టాలని అధికారులు చెబుతున్నారు.

చిల్లకూరు: గూడూరు నియోజకవర్గంలోని మూడు మండలాల్లో సముద్రం తీరంతోపాటు స్వర్ణముఖి నది పరివాహక ప్రాంతం ఉంది. ఇందులో చిల్లకూరు, కోట మండలాల్లో సిలికా గుంతల్లో నీరు పుష్కలంగా ఉంది. చిట్టమూరు, కోట, వాకాడు మండలాల్లో స్వర్ణముఖి నదిలో నీరు ఉంది. ఎక్కువగా ఇసుక తోడైయడంతో పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఈత కొట్టడానికి దిగితే ఇసుకలో కూరుకుపోయే ప్రమాదం ఉంది. అలాగే వాకాడు మండలం తూపిలిపాళెం, కోట మండలం శ్రీనివాసపత్రం, చిల్లకూరు మండలంలోని తీగపాళెం ప్రాంతాల్లోని సముద్ర తీరంలో సరదాగా గడిపేందుకు సుదూర ప్రాంతాల నుంచి కూడా ఎక్కువ మంది వస్తుంటారు. అలాంటి సమయంలో అలల ఉధృతికి సముద్రంలో గల్లంతై ప్రాణాలు కోల్పోతున్నారు.



గుంతల వద్ద అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

ఈ ఏడాది 15 మంది వరకు మృత్యువాత

ఈ ఏడాది గూడూరు నియోజకవర్గంలో ఈతకు వెళ్లి సుమారు 15 మంది వరకు మృత్యువాత పడ్డారు.

- జనవరిలో తిరుపతికి చెందిన నలుగురు యువకులు తూపిలిపాళెం వచ్చారు. వారిలో ఒక యువకుడు సముద్రంలో గల్లంతయ్యాడు.
- వైట్ కుప్పం గ్రామానికి చెందిన ఓ యువకుడు సముద్రంలో ఈతకు వెళ్లి మృతి చెందాడు.
- తూపిలిపాళెం వద్ద చిట్టమూరు మండలం కొక్కుపాళెంకు చెందిన ఓ యువకుడు సముద్రంలో మునిగిపోయాడు.
- ఫిబ్రవరిలో చిట్టమూరు మండలంలో ఇసుక తోడేసిన గంతల్లో ఈతకు వెళ్లి చిన్నారి మృతి చెందాడు. అలాగే మరొకరు పనికి వెళ్లి స్నానం చేసేందుకు ఇసుక గుంతల్లో దిగి ప్రాణాల మీదకు తెచ్చుకున్నాడు.
- మార్చిలో చిల్లకూరు మండలం కొత్తపాళెం వద్ద సిలికా గుంతల్లో దిగి ఓ వ్యక్తి మృతిచెందాడు.
- అన్నంబాకలో అయ్యప్ప మాల ధరించిన యువకుడు బావిలో ఈతకు వెళ్లి మృత్యువాత పడ్డాడు.
- కోట మండలం గూడలి ప్రాంతంలో ఇసుక గుంతల్లో దిగి యవకుడు మృతి చెందాడు.



సముద్రంలో ఈతకు వెళ్లి మృతి చెందిన యువకుడి మృత దేహం వద్ద విలపిస్తున్న బంధువులు (ఫైల్)

పెద్దల సంరక్షణలోనే ఈత నేర్చుకోవాలి



వేసవి సెలవుల్లో సరదాగా గడపడం అందరికి ఇష్టమే. పెద్దల సంరక్షణలోనే ఈత నేర్చుకోవాలి. సెలవుల్లో ఇంటి వద్ద ఉంటూ చేయాల్సిన పనులపై పిల్లలకు పాఠశాలలో అవగాహన కల్పిస్తున్నాం. ఇంటి వద్ద తల్లిదండ్రులు కూడా పిల్లలు ఎక్కడ తిరుగుతున్నారు అనే విషయంపై దృష్టి పెడితే ప్రమాదాలను నివారించవచ్చు.

–శివసుబ్రహ్మణ్యం, హెచ్ఎం చింతవరం జెడ్పీ హైస్కూల్

హెచ్చరికలు చేస్తున్నాం



వేసవి సెలవుల్లో సరదాగా గడిపేందుకు వాకాడు మండలంలోని పలు ప్రాంతాల్లో ఉన్న సముద్రం తీరానికి వస్తుంటారు. వారందరికీ ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేస్తున్నాం. లోతు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లోకి వెళ్లకుండా సిబ్బందిని పెడుతున్నాం. కొంతమంది లెక్క చేయకుండా ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు.

–హుస్సేన్‌బాషా, సీఐ, వాకాడు సర్కిల్

ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి

సైదాపురం/కలువాయి(సైదాపురం): రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని సైదాపురం, కలువాయి ఏవోలు హైమావతి , ప్రతాప్ తెలిపారు. వారు సోమవారం సైదాపురం మండలలోని కమ్మవారిపల్లి, కలువాయి మండలంలో భూసార పరీక్షలు చేశారు. ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ రైతులు భూసార పరీక్షలు చేసుకుని ఫలితాలకు అనుగుణంగా పంటలు సాగు చేయాలన్నారు. కలువాయి ఈఏఈవోడీ రామకృష్ణ, వీఏఏలు మేఘన, సాయి ప్రియాంక పాల్గొన్నారు.

పీడీ పోస్టులు రద్దు చేయొద్దు



ప్రిన్సిపాల్‌కు వినతి పత్రం అందజేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

రాపూరు: రాష్ట్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పీడీ పోస్టులను రద్దు చేయొద్దని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరారు. వారు సోమవారం రాపూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకట్ నాయక్‌కు వినతి ప్రతం అందజేశారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు కళాశాలల్లో క్రీడలు ఆడకుండా చేయడం దారుణమన్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి పీడీ పోస్టులను రద్దు చేయకుండా చూడాలని కోరారు. విజయలక్ష్మి, రమేష్, నరసింహా, పెంచలయ్య, వి.పెంచలయ్య పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరి

దక్కిలి: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ శివశంకర్ తెలిపారు. ఆయన సోమవారం వెంకటగిరి–రాపూరు రోడ్డులోని కందలవారిపల్లి వద్ద వాహనాల తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్సు ఉండాలన్నారు. హెల్మెట్ ధరించని వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని సూచించారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం



ఓజిలి : ఆహార ఉత్పత్తులపై అవగాహన కల్పిస్తున్న వీరరాఘవయ్య, జైతున్‌బీ

ఓజిలి : రసాయనిక ఎరువులు వినియోగం లేని ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు లాభదాయకమని ఏవో విజయలక్ష్మి తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ప్రకృతి వ్యవసా య పద్ధతిలో పండించిన ఉత్పత్తులను ప్రదర్శించారు. ఆమె మాట్లాడుతూ కషాయాలు, ఘనజీవామృతం, సేంద్రియ ఎరువులతో పండించిన కూరగాయలు తినడం వల్ల వ్యాధులకు దూరంగా ఉండొచ్చన్నారు. డీఎంలు వీరరాఘవయ్య, ఓజిలి ఇన్‌చార్జి జైతున్‌బీ, సిబ్బంది రాజేష్, గురవయ్య, చెంచమ్మ, ప్రశాంతి, మాధురి, సాయిప్రియ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం పెంచాలి

కోట: ప్రకృతి వ్యవసాయం చేసేందుకు ముందుకు వచ్చే వారికి ప్రభుత్వం రుణాలు అందజేస్తుందని వెలుగు ఏపీఎం అనీల తెలిపారు. తిన్నెలపూడిలో సోమవారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఇంటి ముందు పెరటితోటలు సాగు చేసుకుని కూరగాయలు పండించుకోవాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం చేసే వారికి అవసరమైతే పొదుపు సంఘాల నుంచి రుణాలు ఇప్పిస్తామన్నారు. అనంతరం ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌పై చర్చించారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీదేవి, పెంచలయ్య, వ్యవసాయశాఖ సిబ్బంది దినేష్, శంకర్, శ్రీనివాసులు, పద్మ, భాగ్యలక్ష్మీ పాల్గొన్నారు.

ఉపాధి కిం నీటి తొట్టెల నిర్మాణం

చిల్లకూరు : ఉపాధి హామీ కింద పశువుల దాహార్తిని తీర్చేందుకు నీటి తొట్టెలు నిర్మిస్తున్నట్టు ఏపీడీ వరప్రసాద్‌రావు తెలిపారు. ఆయన సోమవారం ఉపాధి సిబ్బందితో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఎన్ని పశువులు ఉన్నాయి. వాటికి ఎన్ని తొట్టెలు నిర్మించాలన్న వివరాలను స్థానిక పశు వైద్యాధికారి ద్వారా తెలుసుకోవాలన్నారు. తర్వాత అంచనాలు తయారు చేయాలని సూచించారు. ప్రస్తుతం నిర్మించిన తొట్టెల్లో నీటిని నింపి పశువులకు దాహార్తి తీర్చాలని ఆదేశించారు. ఉపాధి ఏపీవో గిరిబాబు, ఈసీలు పాల్గొన్నారు.

తిన్నెలపూడిలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

కోట : మండలంలోని తిన్నెలపూడిలో సోమవారం స్విమ్స్ వైద్యులు చైతన్యభాను, హరిత ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. వారు మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలన్నారు. మహిళలకు రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ పరీక్షలు చేశారు. పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో చిట్టేడు పీహెచ్‌సీ డాక్టర్లు నాగరాజు, సంధ్య పాల్గొన్నారు.

కోతలగుంటలో వైద్య శిబిరం



పరీక్షలు చేస్తున్న వైద్యుడు విజయ్‌కుమార్ రెడ్డి

చిట్టమూరు: మండలంలోని ఈశ్వరవాక పంచాయతీ కోతలగుంటలో సోమవారం ఈశ్వరవాక పీహెచ్‌సీ వైద్యుడు విజయ్‌కుమార్ రెడ్డి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామంలో ఆదివారం కొండ తేనెటీగలు దాడి చేయడంతో 20 మందికి పైగా గాయపడిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వైద్య శిబిరం ఏర్పాటు చేసి రక్త పరీక్షలు చేశారు. శరీరంలో తేనె టీగల ముల్లును తీసివేసినట్టు డాక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ప్రస్తుతానికి పరిస్థితి అదుపులోనే ఉందన్నారు. తేనెటీగల విష ప్రభావం మూడు రోజులు ఉంటుందని, అప్పటి వరకు వైద్య సిబ్బంది పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఎవరికైనా తీవ్ర అనారోగ్య పరిస్థితి ఉంటే వెంటనే అన్ని సదుపాయాలున్న వైద్యశాలకు తరలిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో అలీమ్ మహ్మద్, ఫార్మసిస్టు మస్తాన్‌బాబు, ఏఎన్ఎం నాగభూషణమ్మ పాల్గొన్నారు.

461వ నేత్ర దాత అమరేంద్రరెడ్డి



తడ: నేత్రదాన మహోద్యమంలో తడ మండలం వెండ్లూరుపాడు పంచాయతీ గుర్రాలమిట్టకు చెందిన వేనాటి అమరేంద్రరెడ్డి(53) 461వ నేత్రదాతగా నిలిచారు. సూళ్లూరుపేటకు చెందిన ఆచార్య భరద్వాజ సేవా సమితి ఆధ్వర్యంలో నేత్ర దాన ఉద్యమం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా వారు సోమవారం అమరేంద్రరెడ్డి పార్థివదేహం నుంచి కుటుంబ సభ్యుల అంగీకారంతో కార్నియాలను సేకరించి చెన్నై శంకర నేత్రాలయకు తరలించారు.

డయాలసిస్ కేంద్రంపై ఫిర్యాదు



ఆర్ఎంవోకు ఫిర్యాదు చేస్తున్న శశికుమార్

గూడూరు రూరల్ : గూడూరు ఏరియా ఆస్పత్రిలో నిర్వహించే డయాలసిస్ కేంద్రం నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు శశికుమార్ డిమాండ్ చేశారు. ఆయన సోమవారం ఆస్పత్రి ఆర్ఎంవోకు ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ గూడూరు రూరల్ పరిధిలోని అయ్యవారిపాళెంకు చెందిన ఒక మహిళ గత ఎనిమిదేళ్లుగా ఇక్కడ డయాలసిస్ చేయించుకుంటున్నట్టు తెలిపారు. ఈ నెల 7న డయాలసిస్ చేయించుకునేందుకు వచ్చిందన్నారు. ఆమెకు డయాలసిస్ చేస్తూ రెండు గంటల తర్వాత రక్త పోటు తగ్గిపోయిందని చెప్పి ఇంటికి తీసుకువెళ్లాలని సూచించినట్టు తెలిపారు. దీంతో ఆమె మృతి చెందిందన్నారు. ఇలా తరచూ జరుగుతున్నా నిర్వాహకులపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేసి నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన ఆర్ఎంవో పరిశీలించి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

మహిళలకు చీరల పంపిణీ



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న సీతారామ ధార్మిక సే సంస్థ ప్రతినిధులు

వాకాడు : మండలంలోని బాలిరెడ్డిపాళెం పట్టాభిరామాలయంలో సోమవారం సీతారామ ధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ముసునూరు మస్తాన్‌రెడ్డి కుటుంబ సభ్యులు 35 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఆలయ ధర్మకర్త కొడవలూరు దామోదర్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, మమత, బిరదవోలు సరిత, రంగయ్య, సంస్థ ప్రతినిధులు దీవి అనంతబాబు, వంశీ ప్రియసుశాంతి, శిరీష, రమాదేవి, నాగమౌనిక తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్నుల వసూళ్లకు స్పెషల్ డ్రైవ్



ఇళ్ల వద్దకు వెళ్లి పన్నులు వసూలు చేస్తున్న కమిషనర్ ఫజులుల్లా

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట మున్సిపాలిటీలో ఆస్తి, నీటి పన్నుల వసూళ్లకు కమిషనర్ షేక్ ఫజులుల్లా సోమవారం స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. బిల్ కలెక్టర్‌లతో పాటు సచివాలయ సిబ్బందితో కలిసి అధిక మొత్తంలో పన్ను బకాయిలు ఉన్న వారి ఇంటి వద్దకు వెళ్లారు. బకాయిలపై ప్రభుత్వం 50 శాతం రాయితీ ఇస్తోందని, ఈ ఏడాది పన్నులు చెల్లించే వారికి 5 శాతం రాయితీ ఇస్తున్నట్టు తెలిపారు. పన్నులు చెల్లింకపోతే బకాయిదారులపై మున్సిపల్ నిబంధనలు మేరకు చర్యలు చేపడతామని హెచ్చరించారు. అదే విధంగా వార్డుల్లో పారిశుద్ధ్య పనులను తనిఖీ చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కార్మికులను హెచ్చరించారు.

నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడి

వెంకటగిరి రూరల్ : రైతులు నాణ్యమైన విత్తనాలు విత్తాలని ఏపీ ఎస్‌వోపీసీఏ జిల్లా ఏవాల్యుయేటర్ మునిశేఖర్, ఏడీఏ నాగార్జునసాగర్ తెలిపారు. వారు సోమవారం ఎఫ్‌బీవో కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఇండి–గ్యాప్ పొలంబడి, వ్యవసాయశాఖ ఏడీ కార్యాలయంలో వెంకటగిరి సబ్‌డివిజన్ పరిధిలోని వ్యవసాయశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రైతులకు మెరుగైన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించాలని సూచించారు. రైతుల నుంచి విత్తనాలు సేకరించి బెంగళూరు ల్యాబ్‌కు పంపించారు. వ్యవసాయశాఖ అధికారులు సుజాత, శిరీష, విజయభారతి పాల్గొన్నారు.

పాఠశాలను మార్చొద్దని వినతి



పాఠశాలను మార్చొద్దని కోరుతున్న పిల్లలు, విద్యార్థుల తల్లిదండ్రులు

చిట్టమూరు: మండలంలోని నార్తువరత్తూరు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులను చిల్లమూరు గ్రామానికి మార్చొద్దని గ్రామస్తులు కోరారు. వారు సోమవారం ఎంఈవో–2 వెంకటేశ్వరప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో 25 మంది పిల్లలు చదువుతున్నారని తెలిపారు. వారు మూడో తరగతికి తమ గ్రామానికి దూరంగా ఉన్న చిల్లమూరు పాఠశాలకు వెళ్లాలని అధికారులు తెలిపినట్టు తెలిపారు. 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న పాఠశాలకు పిల్లలు ఎలా వెళతారని నిలదీశారు. తమ గ్రామంలోనే పాఠశాలను నిర్వహించాలని, లేనిపక్షంలో పిల్లలను బడికి పంపించేది లేదని హెచ్చరించారు. ఎంఈవో మాట్లాడుతూ సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళతామని తెలిపారు.

హనుమంతుడిపై భక్తవరదుడి విహారం



సైదాపురం: మండలంలోని కృష్ణారెడ్డిపల్లిలోని వైకుంఠపురంలో శ్రీమహావిష్ణువు ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం శ్రీమహావిష్ణువు హనుమంతుని వాహనంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తును విశేషంగా అలంకరించి హనుమంత వాహనంపై కొలువుదీర్చి ఊరేగించారు.

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి



పెళ్లకూరు : పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీలు



దక్కిలి : పోషణ్ పక్వాడాపై అవగాహన కల్పిస్తున్న సీడీపీవో శంషాద్‌బేగం



వాకాడు: పౌష్టికాహారంపై వివరిస్తున్న సూపర్ వైజర్ కవిత

పెళ్లకూరు/దక్కిలి/వాకాడు: చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని పెళ్లకూరు మండలం చిల్లకూరు అంగన్‌వాడీ వర్కర్ మల్లెమ్మ, వెంకటగిరి ఐసీడీఎస్ సీడీపీవో శంషాద్‌బేగం, వాకాడు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత తెలిపారు. పెళ్లకూరు మండలం చిల్లకూరు, దక్కిలి మండలం దక్కిలి, మిట్టవడ్డిపల్లి, వాకాడు మండలం పంబలి అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు, బాలింతలు, గర్భిణుల ఆరోగ్య విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మొలకెత్తిన విత్తనాలు, తాజా పండ్లు, ఆకు కూరలు, పాలు, గుడ్లు తినాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ సిబ్బంది ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఎం సురేంద్రబాబు, శివప్రసాద్, ఏఎన్ఎం భూలక్ష్మీ, దక్కిలి సూపర్‌వైజర్ పరిమళ, అంగన్‌వాడీ వర్కర్స్ సుకన్య, నాగమణి, వాకాడు అంగన్‌వాడీ సిబ్బంది వాసుధి, పద్మ, వసుధమ్మ, సుష్మ పాల్గొన్నారు.

చెరువులో తుమ్మ చెట్లు నరికి వేత



కూటమి నేతలు నరికేసిన తుమ్మ చెట్లు

చిల్లకూరు : కూటమి నాయకులు అధికారం అండతో సహజ వనరులను దోచుకంటూ జేబులు నింపుకుంటున్నారు. ఈ క్రమంలోనే గూడూరు మండలం విందూరు చెరువులో ఉన్న తుమ్మ చెట్లను నరికి గుట్టు చప్పడు కాకుండా కలపను విక్రయించారు. కొన్నేళ్ల క్రితం అటవీ శాఖ అధికారులు విందూరు చెరువులో తుమ్మ మొక్కలు నాటి పంచాయతీకి అప్పగించారు. ప్రస్తుతం అవి ఏపుగా పెరిగాయి. వాటిని పంచాయతీ ఆధ్వర్యంలో వేలం పాటలు నిర్వహించి విక్రయించాల్సి ఉంది. ఈ క్రమంలో వాటిపై కన్నేసిన కూటమి నేతలు రాత్రికి రాత్రి చెట్లను నరికి రెండు లోడులను తరలించేశారు. ఒక లోడు తుమ్మ కలప రూ.2 లక్షల వరకు పలుకుతోంది. ఈ విషయాన్ని స్థానికులు పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన విచారించి చెట్లు నరికిన వారిపై ఫిర్యాదు చేస్తామని తెలిపారు. దీనిపై డీపీవో వెంకటరమణను వివరణ కోరగా చెట్లు నరకడానికి అనుమతులు ఇవ్వలేదన్నారు. పూర్తి సమాచారం తెలుసుకుని చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అధ్యాపకుడికి సన్మానం



అధ్యాపకుడిని సత్కరిస్తున్న తోటి అధ్యాపకులు

చిల్లకూరు: పిల్లలకు విద్యా బోధన చేస్తూనే సమాజాన్ని చైతన్యపరుస్తూ రచనలు చేయడం, నాటకాలను ప్రదర్శిస్తున్న ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు బద్రి వీరకుమార్‌ను సహచర అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది సోమవారం ఘనంగా సన్మానించారు. ఆయనను ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం 2025 కందుకూరి రంగస్థల విశిష్ట పురస్కారంతో సత్కరించింది. అలాగే హైదరాబాద్‌కు చెందిన మెగా హెల్పింగ్ ఫౌండేషన్ సంస్థ బహుముఖ ప్రజ్ఞాశాలిగా గుర్తించి నంది అవార్డు అందజేసింది. ఈ క్రమంలో కళాశాలలో సోమ వారం అభినందన కార్యక్రమం నిర్వహించి సత్కరించారు. ప్రిన్సిపాల్ కే శివప్రసాద్ మాట్లాడుతూ జీవితాన్ని ప్రతిబింబించేదే నాటకమని, నాటకానికి ప్రతి స్పందించేదే జీవితం అనే సత్యాన్ని తెలుపుతూ వీరకుమార్ రచనలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, పీడీ నారాయణరాజు, అధ్యాపకులు కోటేశ్వరరావు, విజయమహేష్, మైమూన్, ఝాన్సీవాణి, కృపాకరుణవాణి, గోవిందు సురేంద్ర, శైలజ, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.